



మద్దిముస్త్యాలలో బైక్ ర్యాలీ చేపట్టిన నాయకులు

చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలంటూ బైక్ ర్యాలీ

- ఈ నెల 12న విద్యాసంస్థల బంద్

కొమురవెల్లి/చేర్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అన్ని అర్హతలున్న చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కొమురవెల్లి మండలంతో పాటు అన్ని గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జి.దివ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు కొత్త రెవెన్యూ డివిజన్‌లను ఏర్పాటు చేసినా చేర్యాలను మాత్రం విస్మరించిందని మండిపడ్డారు. అన్ని మండలాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించి ఈ నెల 25న రాజీవ్ రహదారిని ముట్టడిస్తామని హెచ్చరించారు. స్థానిక ఎన్నికల లోపు చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయని పక్షంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయవద్దని గ్రామాల్లో పిలుపునిస్తామన్నారు. బైక్ ర్యాలీలో జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్య, నాయకులు గీస భిక్షపతి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, బూర్గు సురేష్ గౌడ్, తలారి కిషన్, సిలివేరు సిద్దప్ప పాల్గొన్నారు.

విద్యార్థులకు వివరించాలి

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఆవశ్యకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలని, డివిజన్ ఏర్పాటు కాంక్షిస్తూ ఈనెల 12న చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ కోరారు. చేర్యాల మండల కేంద్రంలోని జేఏసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల భౌగోళి, సామాజిక, రాజకీయ పరిసాలనపట్ల విద్యార్థులకు సమగ్ర అవగాహన కలిగి ఉండేలా ఉపాధ్యాయులు పాటుపడాలని కోరారు. అనంతరం విద్యాసంస్థల బంద్ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, గడిపె బాలనర్సయ్య, పిల్లి చంద్రం, పోలోజు వెంకటాద్రి, కరెడ్ల రాజిరెడ్డి, ఈరు భూమయ్య, ఎక్కలదేవి సుధాకర్, జంగిలి యాదగిరి, కుడిక్యాల బాలమోహన్, వలబోజు నర్సింహాచారి, నంగి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా, డీఏపీతో దిగుబడులు

తొగుట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి); నానోయూరియా, డీఏపీతో మంచి దిగుబడులు సాధించవచ్చని దుబ్బాక వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) మల్లయ్య రైతులకు సూచించారు. మంగళవారం పెద్ద మాసాన్‌పల్లి రైతు వేదికలో ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ సంస్థ, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నానో యూరియా, నానో డీఏపీ వాడకం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా సమర్థవంతమైన ఫలితాలు, దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక డివిజన్ ఉద్యాన అధికారి రమేష్, ఏవో మోహన్, ఇఫ్కో ఏరియా మేనేజర్ చంద్రబాబు, సొసైటీ డైరెక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

మొక్కలకు క్యూఆర్ కోడ్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) :సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని దాదాపు 200 రకాల మొక్కలకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయనున్నారు. నేడు, రేపు రాష్ట్రస్థాయి వృక్షశాస్త్ర కార్యశాలలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మొక్కలకు సంబంధించిన లక్షణాలను చర్చించడానికి క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కోడ్‌ను స్కాన్ చేసినట్లయితే ఆ మొక్కకు సంబంధించిన వివరాలను మొబైల్ స్క్రీన్ మీద డిస్‌ప్లే అవుతాయి. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, కార్యశాల కో కన్వీనర్‌లు డాక్టర్ మిరాజ్ ఫాతిమా, స్రవంతి, మోతుకు శ్రీనివాస్, దువ్వల శ్రీనివాస్, సీఈవో డాక్టర్ గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ మధుసూదన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి ఘనంగా ఎదుర్కోళ్లు

- బ్రహోత్సవాల్లో భాగంగా నేడు కల్యాణోత్సవం
- పలు సంఘాల ఆధ్వర్యంలో ఊరేగింపుగా ఆలయానికి సామగ్రి, సుగంధ ద్రవ్యాల తరలింపు

8

గొర్రెల లెక్క తేలుస్తారా?

- ఉమ్మడి మెదక్ జిల్లాలో అక్రమాలపై ఫోకస్
- దళారులు, అధికారులపై విచారణ షురూ
- ఈడీ చేతికి అక్రమార్కుల చిట్టా
- మెతుకుసీమలో 51,360 మంది లబ్ధిదారులు
- రెండో విడతకు బ్రేక్.. డీడీలు వాపస్

ఉమ్మడి మెదక్ జిల్లాలో గొల్లకుర్మలు ఎందరున్నారు? గత ప్రభుత్వ హయాంలో వీరిలో ఎంతమందికి గొర్రెలు పంపిణీ చేశారు? పంపిణీ చేసిన గొర్రెలు ఇప్పుడు ఉన్నాయా.. లేవా? ఇతర జిల్లాల నుంచి తెచ్చిన గొర్రెలు వీరి వద్ద ఉన్నాయా.. లేక అదేరోజు రీసైక్లింగ్ చేశారా? గొర్రెల కోసం డీడీలు కట్టినవారికి జీవాలు పంపిణీ చేశారా.. డీడీ డబ్బులు తిరిగి ఇచ్చేశారా? లబ్ధిదారులకు గొర్రెలు ఇచ్చే క్రమంలో ఏయే అధికారుల భాగస్వామ్యం ఉంది? ఏయే దళారుల వద్ద కొనుగోలు చేశారు? అనే ప్రశ్నలపై విచారణ మొదలవుతున్నది. గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగాయన్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' కథనం..





సంగారెడ్డి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెక్కాడితే గాని డొక్కాడని గొల్లకుర్మల అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా గొర్రెల పంపిణీ పథకాన్ని చేపట్టారు. సిద్దిపేట జిల్లా కొండపాక కేంద్రంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. సొసైటీల్లో నమోదైన గొల్లకుర్మల పేర్ల ఆధారంగా రెండు దశల్లో వారికి గొర్రెలు పంపిణీ చేయాలని భావించారు. యూనిట్ మొత్తంలో 25 శాతం మొత్తాన్ని లబ్ధిదారులు డీడీ రూపంలో చెల్లిస్తే, మిగిలిన 75 శాతం ప్రభుత్వం సమకూర్చింది. ఒక్కో యూనిట్‌లో లబ్ధిదారులకు 20 గొర్రెలు, ఒక పొట్టేలును పంపిణీ చేశారు. తొలివిడతలో గుర్తించిన వారందరికీ యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడతలో కొంతమందికి మాత్రమే అందజేశారు.

ఆ జాబితాలో పలువురి పేర్లు

గొర్రెల పంపిణీలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్లుగా తేటతెల్లమైంది. లబ్ధిదారులకు ఎంతోకొంత ఆశ చూపించి ఇతర జిల్లాల నుంచి తెచ్చిన గొర్రెలను అధికారుల సహకారంతో దళారులు మళ్లీ విక్రయించడం, కొనుగోలు చేయడంలో నిమగ్నమై రీసైక్లింగ్ దందాకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా లబ్దిదారులకు చెందాల్సిన ప్రయోజనాలన్నీ పలువురు అధికారులు, దళారులకు చెందాయి. ఇదే విషయం బయటపడడంతో అటు ఏసీబీ ఇటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారించారు. సంగారెడ్డి జిల్లాలో పలు అక్రమాలు బయటపడ్డాయి. సిద్దిపేట, మెదక్‌లోనూ పంపిణీ పథకం పక్కదారి పట్టింది. గొర్రెల పంపిణీ పథకంలో భాగస్వాములైన పలువురు ప్రభుత్వ అధికారులు

ఉమ్మడి మెదక్ జిల్లా లబ్ధిదారుల వివరాలు

	తొలి విడత	రెండో విడత
మెదక్	12,998	642
సంగారెడ్డి	19,356	1,422
సిద్దిపేట	15,720	1,222
మొత్తం	48,074	3,286

కొత్తగా కార్లు, ఇళ్లు కొనుగోలు చేసినట్లు విచారణాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల ఆధారంగానే ఎవరెవరి భాగస్వామ్యం ఎంతెంత ఉందనే కోణంలో విచారణకు శ్రీకారం చుడుతున్నారు.

పది లక్షల గొర్రెలు ఏమైనట్లు?

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 51,360 మంది గొల్లకుర్మలకు గొర్రెలు పంపిణీ చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి 21 గొర్రెల చొప్పున పంపిణీ చేస్తే ఆ సంఖ్య దాదాపు 10.78 లక్షలపైనే అవుతున్నది. గొర్రెల పంపిణీ పథకం కంటే ముందు ఉమ్మడి జిల్లాలో ఉన్న గొర్రెల సంఖ్యను పోల్చుతూ ప్రస్తుత సంఖ్యపై దృష్టి పెట్టారు. ఒకవేళ ఆ గొర్రెలను మాంసం విక్రయదారులకు విక్రయించారా.. లేక పంపిణీ సమయంలోనే తిరిగి విక్రయించారా అనే విషయాలపైనా ఆరా తీయనున్నట్లు తెలిసింది. ప్రతీ లబ్ధిదారుడిని క్షేత్రస్థాయిలో విచారిస్తే నిజనిజాలు బయటపడే అవకాశం ఉంటుందని విచారణాధికారులు యోచిస్తున్నారు. ఇందులో లబ్దిదారులను అధికారులు

మిగతా 7వ పేజీలో

ఇంజనీరింగ్ కళాశాలకు వసతులు కల్పిస్తాం

- బాలురు, బాలికలకు వేర్వేరుగా తాత్కాలిక హాస్టల్ వసతి
- కలెక్టర్ హైమావతి

హుస్నాబాద్/నంగునూరు/సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన హుస్నాబాద్ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ కె.హైమావతి హామీ ఇచ్చారు. మంగళవారం హుస్నాబాద్‌లోని కిషన్‌నగర్‌లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాల మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన శాతవాహన ఇంజనీరింగ్ కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్‌తో మాట్లాడారు. అడ్మిషన్లు తగ్గకుండా చూడాలని సూచించారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో 160 మంది విద్యార్థులు చేరినప్పటికీ హాస్టల్ వసతి లేకపోవడంతో చాలా మంది రెండో విడత కౌన్సెలింగ్‌లో వేరే కళాశాలలకు వెళ్లారని ప్రిన్సిపాల్ రవికుమార్ కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్, బాలురు, బాలికలకు వేర్వేరుగా తాత్కాలిక హాస్టల్ వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. మూడో విడత కౌన్సిలింగ్‌లో డిపార్టమెంటల్ అటాడ్ హాస్టల్ అని పేర్కొంటే అడ్మిషన్లు పెరుగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు నీటి కొరత లేకుండా చూడాలని మిషన్ భగీరథ డీఈని ఆదేశించారు. ఐఓసీ కార్యాలయం నుంచి కళాశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనా పంపించాలన్నారు. హుస్నాబాద్ పట్టణం నుంచి కళాశాల వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి ఏర్పాట్లు

నంగునూరు మండలం నర్మెట్టలో రూ.300 కోట్లతో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ ఫ్యాక్టరీని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తామని తెలిపారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై ఉద్యానవనశాఖ, ఆయిల్‌ఫెడ్, రెవెన్యూ, విద్యుత్, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన కోసం తాత్కాలిక హెలిప్యాడ్ నిర్మించాలని, ముండ్రాయి నుంచి నంగునూరు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిన్న చిన్న పొదలను తొలగించి రోడ్డును సురక్షితం చేయాలన్నారు. బహిరంగ సభ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, అతిథుల ఆహ్వానం, స్టేజీ డెకరేషన్, స్క్రీన్‌లు ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, పామ్ ఆయిల్ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి, ఎస్ఈ ఎలక్ట్రిసిటీ, ఈఈ పంచాయతీరాజ్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ, నంగునూరు తహసీల్దార్ సరిత తదితరులు పాల్గొన్నారు.

పలు హాస్టళ్లు తనిఖీ

జిల్లాలోని పలు హాస్టళ్లను మంగళవారం రాత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.



ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

కళ్లకు కట్టినట్లుగా..

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మంగళవారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రత్యక్ష ప్రసారాన్ని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సతీశ్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాధకృష్ణశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సుతో పాటు పార్టీ శ్రేణులు వీక్షించారు. హరీశ్‌రావు ప్రజెంటేషన్ తరువాత కాళేశ్వరం ప్రాజెక్టు విలువ వారు అభిప్రాయపడ్డారు.

- సిద్దిపేట ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి)



సమస్యల పరిష్కారానికి చర్యలు

- బీసీ వెల్ఫేర్ జిల్లా ఇన్‌చార్జి నాగరాజమ్మ
- వంటలు రుచిగా ఉండడం లేదని ప్రజావాణిలో విద్యార్థుల ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టల్ సందర్శన

చిన్నకోడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు బీసీ హాస్టల్‌లో వంటలు రుచికరంగా లేవని, చప్పగా ఉంటున్నాయని, నీళ్ల చారు వడ్డిస్తున్నారని విద్యార్థులు అధికారుల ముందు తమ గోడును వెళ్లబోసుకున్నారు. హాస్టల్‌లో ఇంతకు ముందు పని చేసిన సతీష్ (దినసరి కూలీ) వంట చేయడంతో పాటు తమకు ట్యూషన్ కూడా చెప్పేవారని, అతడిని తిరిగి హాస్టల్‌లోనే ఉంచాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ హైమావతికి విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం బీసీ వెల్ఫేర్ జిల్లా ఇన్‌చార్జి నాగరాజమ్మ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకు ముందు బీఆర్ఎస్‌వీ, కాంగ్రెస్ నాయకులు కూడా హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. అధికారి వెంట అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బాపురాజు, ఎంఈవో యాదవరెడ్డి, హాస్టల్ వార్డెన్ నవీన్ ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న నాగరాజమ్మ

కనుపాపలే కాటేస్తున్నాయ్

- రోజురోజుకు బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు
- వరుస ఘటనలతో ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన
- బాధితులకు అండగా భరోసా కేంద్రాలు

7

కొత్త రాతియుగం నాటి కంకణ శిల లభ్యం!

7

ఆహార ఉత్పత్తుల యంత్రాల ప్రదర్శనకు అపూర్వ స్పందన

- తరలివచ్చిన మహిళలు
- పలు యంత్రాల కొనుగోలుకు కొటేషన్లు తీసుకున్న సంఘాలు
- నేడు కూడా ప్రదర్శన..

హుస్నాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన ఆహార యూనిట్ల యంత్రాల ప్రదర్శనకు స్వశక్తి మహిళా సంఘాల నుంచి అనూహ్య స్పందన లభించింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఈ ప్రదర్శన ఇక్కడ ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి సంస్థల క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) కింద ఈ ప్రదర్శన జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ ప్రదర్శనలో గానుగ నూనె పట్టే యంత్రం, నమ్‌కిన్ (మురుకులు) యంత్రం, చెరుకు రసం తీసే యంత్రం, గ్రేవీ తయారు చేసే యంత్రం, దాల్ మిల్, రైస్ మిల్, మల్టీ చాంబర్ పల్వరైజర్ యంత్రం, రోటీ మేకింగ్ యంత్రం, ప్యాకింగ్ మిషన్ వంటి వాటిని ప్రదర్శించి, వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. 300 మందికి పైగా మహిళలు హాజరయ్యారు. వీరిలో 120 మంది యంత్రాల కొనుగోలుకు కొటేషన్లు తీసుకున్నారు. బ్యాంకుల ద్వారా యంత్రాలు కొనుగోలు చేసే మహిళా సంఘాల సభ్యులకు 35 శాతం సబ్సిడీ లభిస్తుంది. యంత్రం ధరను బట్టి రూ.10లక్షల వరకు సబ్సిడీ పొందే అవకాశం ఉంది. ఈ ప్రదర్శన బుధవారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మల్టీ చాంబర్ పల్వరైజర్‌పై ప్రత్యేక ఆసక్తి

ఈ ప్రదర్శనలో మల్టీ చాంబర్ పల్వరైజర్ యంత్రం మహిళలను ఆకట్టుకుంది. ఈ యంత్రానికి రెండు చాంబర్లు ఉంటాయి. ఒక దానిలో పిండి, పొడి వంటి వస్తువులను, మరొక దానిలో మసాలాలు, పసుపు వంటివాటిని పట్టవచ్చు. ఇది గంటకు 120 కిలోల వరకు పదార్థాలను పొడి చేయగలదు. ఒక్కొక్క పదార్థానికి ఒక్కొక్క జల్లెడ (మెస్) ఉంటుంది. జీఎస్టీ లేకుండా దీని ధర రూ.1.60లక్షల వరకు ఉంటుంది. ఈ యంత్రం ద్వారా గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.



ఆయిల్ డ్రయర్



నమ్‌కిన్ మిషన్



ప్రదర్శనకు హాజరైన మహిళలు



మల్టీచాంబర్ పల్వరైజర్ మిషన్

గంజాయి సాగులో మహిళకు జైలు, జరిమానా

జహీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గంజాయిమొక్కలను సాగు చేస్తూ పట్టుబడిన కేసులో మహిళకు 5సంవత్సరాల జైలుశిక్ష, రూ.25వేలు జరిమానా విధించారు. సంగారెడ్డిజిల్లా అదనపు న్యాయ మూర్తి కె.జయంతి మంగళవారం తీర్పును వెల్లడించారని జహీరాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2020 సంవత్సరంలో సంగారెడ్డిజిల్లా ఝరాసంగం మండలం ఇస్లాంపూర్‌కు చెందిన బోయిని సావిత్రమ్మ అలియాస్ నాయకుని సావిత్రమ్మ తన పొలంలో 175గంజాయి మొక్కలను సాగుచేస్తున్న క్రమంలో ఎక్సైజ్‌అధికారులు అప్పట్లో దాడులుచేసి కేసు నమోదుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాకోర్టులో కేసు కొనసాగింది. అందరి వాదనలను విన్న జిల్లా అదనపు జడ్జ్ మంగళవారం తీర్పును వెలువరించారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించామని ఎక్సైజ్ సీఐ చెప్పారు.

టూరిస్ట్ బస్సును ఢీకొన్న కంటైనర్

తూప్రాన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి హల్దీవాగు బ్రిడ్జి వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఐదు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఓ లారీ డ్రైవర్ వాటి మధ్యలో ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు 44వ జాతీయ రహదారిపై వెళ్తున్న టూరిస్టు బస్సును వెనుక వేగంగా వస్తున్న కంటైనర్ లారీ ఢీకొట్టింది. మరో మూడు లారీలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. భారీ ప్రమాదం జరగడంతో హైవే మీదుగా వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఈ సంఘటనలో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఓ లారీ డ్రైవర్ సుమీర్ సింగ్ (25) వాహనంలో ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. పోలీసులు, వాహన డ్రైవర్లు, అంబులెన్స్ సిబ్బంది బలవంతంగా బయటకు లాగారు. లారీ డ్రైవర్ కాలు నుజ్జునుజ్జయింది. సుమీర్‌సింగ్‌ని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

● ముగ్గురికి గాయాలు

చిన్నశంకరంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొని ముగ్గురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ సంఘటన మంగళవారం చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి గ్రామంలో జరిగింది. నార్సింగ్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులు ఇన్నోవా కారులో వెల్దుర్తికి వెళ్తున్నారు. జంగరాయి గ్రామ శివారులోని బీటీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టింది కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది.

ఆటో బోల్తా పలువురికి గాయాలు

● 8మంది దినసరి కూలీలకు గాయాలు



గాయపడిన మహిళా కూలీలను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

కోహీర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా కొట్టి పలువురికి గాయాలైన సంఘటన కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామ శివారులో మంగళవారం ఉదయం జరిగింది. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లా శివరాంపూర్‌కు చెందిన 8 మంది దినసరి మహిళా కూలీలు కోహీర్‌లో కూలి పని చేసేందుకు వస్తూ ఉండగా బిలాల్‌పూర్ గ్రామం శివారులో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 8 మంది మహిళా కూలీలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఓ మహిళ కాలు విరిగింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో గాయపడిన మహిళా కూలీలు చాలాసేపు గాయాలతో ఇబ్బంది పడ్డారు. దీంతో స్థానికులు ప్రైవేటు వాహనాల్లో కోహీర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నలుగురు మహిళా కూలీలను సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా మరో నలుగురిని జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

పుల్‌కల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మోటర్ బైక్ అదుపు తప్పి ఫ్లై ఓవర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. మండల కేంద్రమైన చౌటకూర్ వద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి ఫ్లై ఓవర్‌పై జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోర్పోలు గ్రామానికి చెందిన తునికి శివచందర్ (48) అత్తగారి ఊరైన ఆందోలు మండలం తాలెల్మ నుంచి స్వగ్రామానికి మోటారు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మోటారు బైక్ ఫ్లై ఓవర్ వద్దకు రాగానే అదుపు తప్పి రెయిలింగ్ గోడను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో శివచందర్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శివచందర్‌కు భార్య లక్ష్మీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి జోగిపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పుల్కల్ ఎస్సై విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

అనుమానాస్పద స్థితిలో యువకుడి..



తేజ (ఫైల్)

వట్‌పల్లి, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌతపూర్ గ్రామానికి చెందిన బోయిన తేజ (22)అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై లవ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతాపూర్ గ్రామానికి చెందిన బోయిని తేజ అతడి స్నేహితుడు సికిందర్ కలిసి చేపలు పట్టేందుకు మండలంలోని దుర్గమ్మ వాగుకు వెళ్లారు. సికిందర్ ఇంటికి వచ్చాడు. కానీ తేజ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తేజ తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై లవ్ కుమార్ తెలిపారు మంగళవారం దుర్గమ్మ వాగులో శవం కనిపించినట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతి చెందింది తేజ అని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు

కనుపాపలే కాటేస్తున్నాయ్

రోజురోజుకు బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు

- వరుస ఘటనలతో ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన
- బాధితులకు అండగా భరోసా కేంద్రాలు

" సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న బాలికపై ఇంగ్లిష్ టీచర్ వినయ్ ఆగస్టు 4న లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళనతో పోలీసులు వినయ్‌ను అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. గతంలో కూడా ఇదే పాఠశాలలో ఇలాంటి ఘటన జరగడంతో అప్పట్లో పోలీసులు నిందితుడిని అరెస్ట్‌చేశారు.

నారాయణఖేడ్ బీసీ బాలికల హాస్టల్‌లో జూలై 22న వార్డెన్ కుమారుడు, మాజీ కౌన్సిలర్ రాజేష్ చౌహాన్ విద్యార్థినులను వేధించాడు. బాలికల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళనతో పోలీసులు అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు. "

ఇలాంటి ఘటనలు సంగారెడ్డి జిల్లాలో నిత్యాకృత్యంగా మారాయి. కంటికి రెప్పలా కాపాడాకోవాల్సినవారు, విద్యాబుద్ధులు నేర్పేవారే గతి తప్పి తప్పటడుగులు వేస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది.



సంగారెడ్డి క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బాలికల రక్షణ కోసం అనేక చట్టాలున్నప్పటికీ కీచకుల ఆరాచకాలు మాత్రం ఆగడం లేదు. ఏటా బాలికలపై అత్యాచారాలు, లైంగిక దాడులు పెరుగుతూనే ఉన్నాయి. ఇది వారి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గతేడాది జిల్లాలో మహిళలపై 131 అత్యాచార కేసులు నమోదయ్యాయి. అలాగే 168 పోక్సో కేసులు నమోదు కాగా 23 మంది బాలికలపై అత్యాచార కేసులు నమోదయ్యాయి.

జిల్లాలో అత్యాచార ఘటనలిలా..

2022	77
2023	100
2024	131
2025(జూన్)	53

స్మార్ట్‌ఫోన్ల ప్రభావంతోనే...

చట్టాలు సక్రమంగా అమలై నిందితులకు శిక్షలు పడితేనే బాలికలపై లైంగిక వేదింపులు, అత్యాచార ఘటనలు అరికట్టేందుకు అవకాశం వుంటుందని పలు ప్రజా సంఘాలు పేర్కొంటున్నాయి. బాలికల రక్షణ కోసం పోక్సో, నిర్భయ వంటి చట్టాలు ఉన్నప్పటికీ నిందితుల్లో భయం లేని కారణంగానే దాడులు, అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నేడు ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌ఫోన్ అనివార్యంగా మారింది. ఆన్‌లైన్ క్లాసలంటూ వాడకంతో యువత చెడుమార్గంలోకి వెళ్తోంది. ఇంటర్‌నెట్‌లో అవసరమైన దాని కంటే అనవసరమైన వీడియోలు, పోర్న్ వీడియోలు వంటివి వీక్షిస్తున్నారు. దీంతో కొందరు చెడు మార్గాన్ని అనుసరించి ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారు. స్మార్ట్‌ఫోన్ వాడుతున్న పిల్లలపై తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండాలి. స్మార్ట్‌ఫోన్‌లలో ఆన్‌లైన్ తరగతులే వింటున్నారా? లేక ఇంకేమైనా వీడియోలు చూస్తున్నారా? అనే విషయాలపై నిఘా పెట్టాలి. తల్లిదండ్రుల నిర్లక్ష్యం కారణంగా కూడా కొందరు పిల్లలు తప్పుదారి పట్టే ప్రమాదం లేకపోలేదు.

చట్టాలపై అవగాహన అవసరం

బాలికల రక్షణ కోసం ఏర్పాటైన చట్టాలపై న్యాయ సేవాధికార సంస్థ ఆధర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలను వేధిస్తే కఠిన చట్టాలు ఉంటాయని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే సెక్షన్ 354 ప్రకారం ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని, చిన్న పిల్లలను లైంగికంగా వేధిస్తే ప్రివెన్షన్ యాక్టు ఫర్ చిల్డ్రెన్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) కింద కేసులుంటాయని వివరిస్తున్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే దాడులు అరికట్టే అవకాశం ఉంటుంది.

నిర్భయంగా ఫిర్యాదు చేస్తేనే దోషులకు శిక్ష..

తమకు జరిగిన అన్యాయం గురించి నిర్భయంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. న్యాయస్థానం ముందు దోషులకు శిక్ష పడుతుంది. అప్పుడే తిరిగి నేరం చేయడానికి వెనకడుగు వేస్తారు. లైంగిక దాడులకు గురైన బాధితులకు అండగా భరోసా కేంద్రం పనిచేస్తుంది. బాలికలపై,మహిళలకు నూతన చట్టాల అవగాహన కోసం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మహిళలకు రక్షణ కల్పించడానికి జిల్లా పోలీసులు 24/7 అందుబాటులో ఉంటారు.

- పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

బాధితులకు కొండంత 'భరోసా'

మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలను దృష్టిలో ఉంచుకొని, అన్ని రకాల సేవలను ఒకే గొడుగు కింద అందించాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో భరోసా కేంద్రాన్ని 28 సెప్టెంబరు 2020న ప్రారంభించారు. ఈ భరోసాలో శిక్షణ పొందిన సిబ్బంది, బాధిత మహిళలను అక్కున చేర్చుకొని వారిలో కొండంత ధైర్యాన్ని నింపుతున్నారు. బాధితులకు అన్ని రకాల సేవలు (మెడికల్, లీగల్, పరిహారం) ఒకే వేదికగా అందిస్తూ, వారికి బాధ నుండి విముక్తి కల్పిస్తూ సత్వర న్యాయం చేకూరేలా సేవలందిస్తున్నారు. అలాగే భరోసా సెంటర్ ద్వారా పోక్సో, మహిళల పై అత్యాచార కేసులను నియంత్రించడానికి పాఠశాలలు, కళాశాలల్లో తరుచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోక్సో కేసు నమోదు అయినప్పటి నుంచి చివరి వరకు బాధితులకు అండగా ఉంటూ, నేరస్తులకు శిక్ష పడేలా చేయడమే భరోసా సిబ్బంది పాటు పడుతున్నారు.



తంగళ్లపల్లి కస్తూర్బాలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కృష్ణారావు

'నాణ్యమైన విద్యా బోధన చేయాలి'

కోహెడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్థాయికి అనుగుణంగానే నాణ్యమైన విద్యాబోధన జరగాలని తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం అధిపతి (ఎస్ఎస్‌సీ బోర్డు), జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని శనిగరం, తంగళ్లపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. శనిగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరును పరిశీలించిన కృష్ణారావు, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో బోధనా విధానాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రంగనాథ్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఎం. సరళ, ప్రధానోపాధ్యాయులు కన్యాకుమారి, కేజీబీవీ ప్రత్యేక అధికారి వై. హిమబిందు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- యూఎస్‌పీసీ రాష్ట్ర కమిటీ



కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, వై. అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని తిరిగి అమలు చేయాలని, పీఆర్‌సీ నివేదికను వెంటనే బహిర్గతం చేసి చర్చల ద్వారా ఆమోదయోగ్యమైన పీఆర్‌సీని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 హెడ్ కింద జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, లక్ష్మయ్య యాదవ్, అశోక్, సోమశేఖర్, సాయిలు, రాంచందర్, సువర్ణ, కాశీనాథ్, నాజర్‌పటేల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో మహిళ మృతి



పున్నవ్వ (ఫైల్)

దౌల్తాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాత్రూంలో లైట్ వేయబోయి విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని పోసానిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పోసానిపల్లికి చెందిన పున్నవ్వ(51) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ తన ఇద్దరు కొడుకులు, ఒక కూతురితో జీవనం సాగిస్తున్నారు. ఆమె భర్త నర్సింహులు ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. సోమవారం రాత్రి 10 గంటలకు పున్నవ్వ బాత్రూంకు వెళ్తూ లైట్ స్విచ్ వేయబోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. ఇంట్లో ఉన్న పెద్ద కుమారుడు బయటకు వచ్చి చూసేసరికి ఆమె కిందపడి ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అరుణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. పున్నవ్వ పెద్ద కుమారుడు కనకరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

- అత్తగారి ఇంటిపై మృతురాలి బంధువుల దాడి
- భారీగా మోహరించిన పోలీసులు

శివ్వంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చండీ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం ఎలకంటి గ్రామానికి చెందిన నాగరాణి(26)కి ఐదు సంవత్సరాల క్రితం చండీ గ్రామానికి చెందిన కుమ్మరి దాచారం సత్యనారాయణతో వివాహం జరిగింది. మంగళవారం భోజనం విషయంలో నాగరాణికి ఆమె అత్తకు గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నాగరాణి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమెకు కూతురు, కుమారుడు ఉన్నారు. నాగరాణి బంధువులు ఈ విషయం తెలుసుకుని డీసీఎంలో పెద్ద ఎత్తున చండీ గ్రామానికి చేరుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బంధువులు నాగరాణి అత్తగారి ఇంటిపై రాళ్లతో దాడి చేసి, ఇంటి పెంకులు, రేకులు, టీవీ తదితర వస్తువులను ధ్వంసం చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న తూప్రాన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు.

షేర్ మార్కెట్‌లో నష్టాలతో యువకుడు..



దయాకర్ (ఫైల్)

మిరుదొడ్డి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): షేర్ మార్కెట్ (ఆన్‌లైన్ ట్రేడింగ్)లో నష్టాలు రావడంతో మానసికంగా కుంగిపోయిన ఓ యువకుడు ఉరి వేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో మంగళవారం జరిగింది. ఎస్సై సమతా కథనం ప్రకారం.. మిరుదొడ్డి గ్రామానికి చెందిన పయ్యావుల దయాకర్(29) డిగ్రీ వరకు చదివాడు. ఆరేళ్లుగా షేర్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేస్తున్నాడు. ఇందులో రూ. 6 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు నష్టం వచ్చింది. దీంతో మానసికంగా కుంగిపోయిన దయాకర్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. తల్లి వచ్చి చూడగా, అప్పటికే చనిపోయి ఉన్నాడు. ఏడాది క్రితమే దయాకర్ తండ్రి చనిపోయాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, కల్చరల్/మెదక్ మున్సిపాలిటీ/చిన్నశంకరంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం ఆయన చిన్నశంకరంపేట మండలంలోని గవ్వపల్లి గ్రామంలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్వాక్రా మహిళా సంఘాలు బ్యాంకు రుణాలను తీసుకొని, వివిధ రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే వడ్డీ లేని రుణాల కింద 7,668 యూనిట్లు నెలకొల్పారని తెలిపారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి సంస్థల క్రమబద్ధీకరణ పథకం కింద కూడా 150 యూనిట్లు ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని వివరించారు. ఈ పథకం కింద రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారని, ఇందులో 70 శాతం లబ్ధిదారుడు చెల్లిస్తే, 30 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. అనంతరం ఆయన మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరాపురి కాలనీలో పర్యటించారు. ప్రజల ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా లేకపోవడాన్ని గమనించి, వారికి అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద టైర్లు, కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.



చిన్నశంకరంపేటలోని ఓ జనరల్ స్టోర్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్‌కు రాఖీ అందిస్తున్న మహిళ

చదువుల తల్లికి అండగా.. యాదాద్రి కలెక్టర్

- ఉన్నత చదువులు చదివిస్తానని హామీ



కలెక్టర్ హనుమంతరావు సన్మానిస్తున్న దృశ్యం

మర్కుక్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆమె ఐదో తరగతిలో ఉండగా.. ఆయన అక్కడ ప్రత్యేకాధికారి. అప్పట్లో ఆమెలోని ప్రతిభను గుర్తించిన ఆయన తాను ఎక్కడ ఉన్నా విద్యార్థి చదువులకు అండగా ఉంటానని మాట ఇచ్చారు. ఇప్పుడాయన యాదాద్రి భువనగిరి కలెక్టర్. ఆమె ఇప్పుడు ఇంటర్‌లో వెయ్యికి 992 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఉన్నత చదువులు చదివే పరిస్థితి లేకపోవడంతో ఆర్థిక భరోసా కోసం అప్పుడు మాట ఇచ్చిన.. ఇప్పటి యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావును కలిసింది. ఆయన ఆమె చదువులకు అయ్యే ఖర్చులన్నింటినీ భరిస్తానని మాట ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు సిద్దిపేట లాల్ల గజ్వేల్ ప్రత్యేక అధికారిగా ఉన్న సమయంలో మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల మూతపడే దశకు చేరుకుందని తెలుసుకున్నారు. ఊరి వాళ్లతో మాట్లాడి పిల్లలు బడికి వచ్చేలా చేసి, ఆ బడిని బతికించారు. అప్పుడు ఆ గ్రామానికి చెందిన బిళ్ల స్వాతిక అనే ఐదో తరగతి విద్యార్థిని ప్రతిభ చూసి అభినందించడంతో పాటు ఆమెకు చదవు విషయంలో అండగా ఉంటానని మాట ఇచ్చారు. ఆయన స్ఫూర్తితో బిళ్ల సాత్విక చదువులో ముందడుగు వేసింది. పదో తరగతిలో పది జీపీఏతో నిలిచింది. ఇంటర్ ఎంపీసీలో వెయ్యికి 992 మార్కులతో రాష్ట్రంలో మూడు స్థానంలో నిలిచింది. మంచి కాలేజీలో ఇంజనీరింగ్ కోర్సు చదివేందుకు సీటు సంపాదించింది. కానీ, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతే కావడం, ఎప్పుడో మాట ఇచ్చిన అధికారి ఎక్కడ ఉన్నారో వెతికి మంగళవారం వెళ్లి కలిసింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ హనుమంతరావు.. విద్యార్థిని అభినందించడంతో పాటు ఆమె ఉన్నత చదువులకు అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట గ్రామ మాజీ సర్పంచ్ దుద్దెడ రాములుగౌడ్, పాఠశాల హెచ్‌ఎం బాలకిషన్, ఉపాధ్యాయులు చిన్ని కృష, విద్యార్థిని తండ్రి శ్యాంసుందర్ ఉన్నారు.

కుళ్లిన కోడిగుడ్లపై ఐసీడీఎస్ అధికారుల విచారణ

చేర్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నెం.2లో ఇటీవల పంపిణీ చేసిన కోడిగుడ్లు కుళ్లిపోయిన విషయమై ఐసీడీఎస్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. డీడబ్ల్యూవో లక్ష్మీకాంతరెడ్డి, సీడీపీవో రమాదేవితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కుళ్లిన గుడ్లు పొందిన లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వ ఉన్న గుడ్లను, ఉడకబెట్టిన గుడ్లను పరిశీలించారు. పోషకాహార సరుకుల పంపిణీపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.



జాతీయ స్థాయి శిక్షణకు చిన్నబ్రహ్మాం



విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న టీచర్ చిన్నబ్రహ్మాయ్య

మర్యాక్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మాయ్య జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకట్రాములు తెలిపారు. గతేడాది మర్రి చెన్నారెడ్డి మానవ హక్కుల భవనంలో నిర్వహించిన ప్రదర్శనలో తన ఉత్తమ బోధన పద్ధతులకు గాను ఆయన ఈ అవకాశం పొందారు. ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 2 వరకు 20 రోజుల పాటు ఢిల్లీలోని సీసీఆర్టీ భవన్‌లో జరిగే నూతన విద్యా విధానంపై వర్క్‌షాప్, శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు అప్పగించాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకులు చుక్కరాములు

జహీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణ సమీపంలోని హోతి(కే) శివారులో నిర్మించిన 660 డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇస్తామని చెప్పి అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే లబ్ధిదారులే నేరుగా తాళాలు పగలగొట్టి ఇళ్లల్లోకి వెళ్తారని హెచ్చరించారు. ఈ విషయంపై తహసీల్దార్ దశరథ స్పందిస్తూ, ఈ నెల 13న ఇళ్లు అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయరాజ్, మైపాల్, రాంచందర్, రాజిరెడ్డి, ముతబీర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గొర్రెల లెక్క తేలుస్తారు!

(5వపేజీ తరువాయి)

ఏజంట్లే పక్కదారి పట్టించారనే ఆరోపణలు ప్రధానంగా ఉండడంతో లబ్దిదారులపై సానుకూల ధోరణి చూపించనున్నారు. కొందరు గొర్రెల పెంపకంపై దృష్టిపెట్టగా మెజార్టీ శాతం అప్పటికప్పుడే వారు చెల్లించిన డీడీ డబ్బులకు రెట్టింపు నగదు తీసుకొని విక్రయించారనే ఫిర్యాదులు ఉన్నాయి.

నిలిచిన రెండో విడత

మొదటి విడతలో దాదాపు గొర్రెల పంపిణీ పూర్తికాగా గత ప్రభుత్వ హయాంలోనే రెండో విడత కూడా ప్రారంభించి కొందరికి మాత్రమే పంపిణీ చేశారు. ఇంతలోనే అధికారం తారుమారు కావడంతో ఆ పథకం ఆగిపోయింది. అప్పటికే గొర్రెల పంపిణీపై అనేక ఆరోపణలు వచ్చాయి. మెదక్ జిల్లాకు సంబంధించి రెండో విడతలో 2,584 మంది డీడీలు కట్టగా 1,942 మందికి తిరిగి ఇచ్చేశారు. సంగారెడ్డి జిల్లాలో 5,290 మంది డీడీలు చెల్లించగా 3,829 మంది వాపస్ తీసుకున్నారు. అదే సిద్దిపేట జిల్లాలో 5,357 డీడీలు కట్టగా 4,135 మందికి తిరిగి ఇచ్చేశారు.

ప్రైవేట్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని కాపాడే ప్రయత్నం చేసిన ప్రైవేట్ హైస్కూల్ గుర్తింపును రద్దు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఏ. రహ్మాన్ డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయం ముందు సీపీఐ నాయకులు స్కూల్ యాజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. రహ్మాన్ మాట్లాడుతూ, లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్‌పై నిర్భయ, పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో సమతాదల్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు గంగయ్య, పాండు, మహబూబ్, మున్నా, ఆసద్, శ్రీనివాస్, బాబు, జగ్జీవన్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రాతియుగం నాటి కంకణ శిల లభ్యం



నంగునూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట శివారులోని పాటిగడ్డ వద్ద కొత్త రాతియుగం నాటి రాతి పనిముట్టు లభ్యమైంది. ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ మంగళవారం దీన్ని గుర్తించారు. ఇది గుండ్రంగా ఉండి, మధ్యలో రంధ్రం ఉందని శ్రీనివాస్ తెలిపారు. దీనిని 'కంకణ శిల' అని పిలుస్తారని చెప్పారు. ఇది 7 సెం.మీ. ఎత్తు, 5 సెం.మీ. వెడల్పు, 4 సెం.మీ. మందం కలిగి ఉంది. పూర్వ మానవులు బరువులు తూయడానికి ఉపయోగించి ఉండవచ్చని ఆయన తెలిపారు. ఇది కొత్త రాతియుగం చివరి దశ కాలం, అంటే క్రీస్తు పూర్వం 2500 నాటిదని, సుమారు 4500 ఏళ్ల క్రితం నాటిదని శ్రీనివాస్ పేర్కొన్నారు.





హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరంపై నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయం నుంచి వీక్షించారు. అలాగే మెదక్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్ష సాధింపులతోనే పాలన కొనసాగిస్తున్నారన్నారు.

- సంగారెడ్డి రూరల్/మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

మోడల్ స్కూల్‌లో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

కొండపాక,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కొండపాక మోడల్ స్కూల్ బాలికల హస్టల్లో అసిస్టెంట్ కుక్ పోస్టులకు, కేజీబీవీ బాలికల హస్టల్లో వెట్ స్వీపర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అసిస్టెంట్ కుక్ పోస్టుకు అర్హత ఏడో తరగతి పాసై ఉండాలని అభ్యర్థులు 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఆసక్తి అర్హత గల వారు మోడల్ స్కూల్ బాలికల హస్టల్ స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తులు ఈ నెల 19 నుంచి 23వ తేదీ లోపు అందజేయాలన్నారు. కేజీబీవీ బాలికల హస్టల్‌లో వెట్ స్వీపర్ పోస్టుకు ఈ నెల 6నుంచి 8వ తేదీలోగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నిర్మాణానికి విరాళం అందజేత

మర్కుక్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవల్లిలో నిర్మాణంలో ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి బీఆర్ఎస్ నాయకుడు విరాళాన్ని అందజేశారు. మంగళవారం కర్కపట్ల గ్రామ బీఆర్ఎస్ యువ నాయకుడు రాళ్లబండి బాలకృష్ణ జన్మదిన సందర్భంగా రూ.1.25 లక్షల విరాళాన్ని అందజేశారు.

రైతు కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం

జగదేవ్‌పూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన యువ రైతు బునారి నరేందర్ ఇటీవల అప్పుల బాధ భరించలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలం లింగా గ్రామానికి చెందిన గార్లపటి శివారెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్యతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు.

యూరియా స్టాక్ పరిశీలన

రాయపోల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల షాపులను గజ్వేల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బాబూనాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా పంపిణీతో పాటు షాపుల్లో ఏర్పాటు చేసిన ధరల పట్టిక, స్టాక్ వివరాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్స్ తనిఖీ చేశారు. రైతులకు విధిగా రసీదులు ఇవ్వాలని సూచించారు.

రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన రైతు బజార్, ఫంక్షన్‌హాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి వ్యవసాయ మార్కెట్‌శాఖ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతు బజార్ నిరుపయోగంగా ఉంటున్న మార్కెట్ కార్యదర్శి, మార్కెట్ చైర్మన్ పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలో రోడ్ల పక్కన కూరగాయలు, పండ్లు విక్రయించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, లేనట్లయితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

సిద్దిపేట అర్బన్ ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, పంచాయతీ సిబ్బందికి వేతనాలు పెంచి రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ జీపీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 51 సవరించాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ కల్పించాలని అన్నారు.

నేరాల అదుపునకు సీసీ కెమెరాలు

తొగుట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. మంగళవారం మండలం లోని బండారుపల్లి, పెద్దమాసాన్‌పల్లి గ్రామాల్లో దుకాణ యజమానుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తొగుట ఎస్ఐ రవికాంత్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు.

మెనూ పాటించాల్సిందే: ఎంఈవో

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈవో బి మనీల సూచించారు. మంగళవారం హుస్నాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అవగాహన సమావేశం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

మద్దూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తూ, బీజేపీని బలోపేతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని దర్మారం గ్రామంలో మండల అధ్యక్షుడు మోకు ఉదయ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బూత్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు.

శ్రీబాలాజీ వేంకటేశ్వరుడికి ఘనంగా ఎదుర్కోళ్లు

● బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు కల్యాణోత్సవం ● పలు సంఘాల ఆధ్వర్యంలో ఊరేగింపుగా ఆలయానికి సామగ్రి, సుగంధ ద్రవ్యాల తరలింపు





దుబ్బాక ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ఎదుర్కోళ్లు, ఆలయానికి చేర్చిన సుగంధద్రవ్యాలు, స్వామివారి సన్నిధికి చేరుకున్న స్వర్ణకారులు

దుబ్బాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరాలయంలో స్వామివారికి కల్యాణఘడియలు సమీపించాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దుబ్బాక ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ఎదుర్కోళ్లు నిర్వహించారు. బుధవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఎదుర్కోళ్లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ సామగ్రి, సుగంధద్రవ్యాలు తీసుకుని పట్టణంలో ఊరేగింపుగా మేళతాళాల మధ్య ఆలయానికి తీసుకెళ్లారు. దుబ్బాక గ్రామ పురోహితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణశర్మలు సంకల్పం చెప్పగా, దుబ్బాక ఆర్యవైశ్యసంఘం నాయకులు చింతరాజు ఆధ్వర్యంలో 108 రకాల శోభనద్రవ్యాలను ఊరేగించారు. ఉదయం స్వర్ణకారులు కూడా స్వామివారికి ఊరేగింపుగా ద్రవ్యాలను తీసుకుని వెళ్లారు. సాయంత్రం రాయబారం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎదుర్కోళ్ల కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఆర్.రాజమౌళి, వడ్లకొండశ్రీధర్, చింతరాజు, చింతనాగేందర్, శంకర్‌గుప్తా, కూర వేణుగోపాల్, చింతశివకుమార్, రాజు, స్వర్ణకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో సామూహిక మంగళగౌరీవ్రతాలు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మంగళవారం పట్టణంలోని శ్రీగౌరీనీలకంఠేశ్వర ఆలయంలో సామూహిక మంగళగౌరి వ్రతాలు, కుంకుమపూజలు నిర్వహించారు. శ్రావణ మంగళవారం రోజున మంగళగౌరి వ్రతమాచరించి, కుంకుమార్చన చేస్తే కుటుంబంలోని పిల్లాపాపలకు అంతా శుభం జరుగుతుందని భక్తుల విశ్వాసం.




విశేష అలంకరణ అమ్మవారు, కుంకుమార్చనలో మహిళలు

తల్లిపాలు చిన్నారులకు అమృతంతో సమానం



చిన్నకోడూరులో చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న ఏసీడీపీవో రేణుక



చేర్యాల మండలం వేచరేణి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు

చిన్నకోడూరు/కొమురవెల్లి/చేర్యాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు చిన్నారులకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ ఏసీడీపీవో రేణుక పేర్కొన్నారు. చిన్నకోడూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలింతలు, గర్భిణులకు తల్లి పాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించి మాట్లాడారు. తల్లిపాలతోనే చిన్నారులకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ భూమవ్వ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలంలోని పోసాన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు. చేర్యాల మండలం వేచరేణి గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వారికి తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మద్దూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ధన్‌రాజ్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మద్దూరు మండలకేంద్రంతో పాటు లద్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఆస్పత్రిలోని రికార్డులతో పాటు గదులను పరిశీలించారు. అనంతరం ఆశాలు నిర్వహిస్తున్న సమీక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణుల సంరక్షణ, కుటుంబ నియంత్రణ, పిల్లల టీకాలు, ఫీవర్ సర్వే లక్షణాలున్న వారిని గుర్తించాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్‌వోను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డీఈఎంవో నవీన్‌కుమార్, వైద్యాధికారి రజిత, సిబ్బందితో పాటు ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. కాగా లద్నూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పని చేసిన తాళ్ల దేవదాసు ఉద్యోగ విరమణ వీడ్కోలు అభినందన మహోత్సవానికి డీఎంహెచ్‌వో డాక్టర్ ధన్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. విధుల పట్ల అంకిత భావంతో పని చేసినప్పుడు ప్రతీ ఉద్యోగికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దేవదాసు దంపతులకు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

బహుజనుల వెనుకబాటుకు కాంగ్రెస్, బీజేపీలే కారణం



మాట్లాడుతున్న బీఎస్పీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ అతర్‌సింగ్ రావు

సిద్దిపేట అర్బన్ ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో బహుజనుల వెనుకబాటు తనానికి కాంగ్రెస్ బీజేపీలే కారణమని, బీఎస్పీ ద్వారా మాత్రమే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమని బీఎస్పీ సెంట్రల్ స్టేట్ కో ఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ అతర్‌సింగ్ రావు పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరు కాగా, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షలో మహనీయుల చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ పోరాటం వల్ల బహుజనులకు హక్కులు లభించాయన్నారు. అనంతరం మరో సెంట్రల్ స్టేట్ కో ఆర్డినేటర్ అడ్వకేట్ నిషాని రామచంద్రం మాట్లాడుతూ దేశం లో బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తుందని, బీఎస్పీ వల్లనే రాజ్యాంగం రక్షించబడుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ మాట్లాడుతూ బహుజనులు రాజ్యాధికారం సాధించకపోతే శాశ్వత బానిసలుగా మారిపోతారన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనగందుల వెంకన్న, రాష్ట్ర కోశాధికారి నాయిని ప్రణయ్, రాష్ట్ర ఈసీ మెంబెర్ కూతాది నర్సింలు, జిల్లా ఇన్‌చార్జిలు డ్యాగల వెంకన్న గజ్జెలతిరుపతి, ఓం ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, కరుణాకర్, వంగ బాబు అధ్యక్షులు పుల్లూరి ఉమేష్, బోయిని బాబు , వేల్పుల రాజు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక దందా



కొండపాక: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

కొండపాక ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలిస్తున్నట్టు తప్పుడు పత్రాలను వాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు వివరాల్లోకి వెళ్తే.. కొండపాక మండలం వెలికట్ట శివారులో పలువురు ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలించేందుకు అనుమతి తీసుకున్నట్టుగా పర్మిషన్ తేదీ అయిపోయిన పత్రాలను వాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ విషయం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పత్రాలను పరిశీలించగా అసలు విషయం తేటతెల్లమైంది. మే 9న ఇసుక పర్మిషన్ ఉన్న పత్రాలు వారి వద్ద లభించాయి. వాటిని చూపిస్తూ అక్రమంగా తరలిస్తున్నారు . దీంతో అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● **బెజ్జంకి:** అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను పోలీసులుస్వాధీనం చేసుకున్నారు. మండలంలోని తోటపల్లి శివారులో మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించి వేర్వేరు ప్రదేశాల్లో నిల్వ చేసిన సుమారు 60 టన్నుల ఇసుకను మంగళవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్, బెజ్జంకి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తారన్నారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో ఆర్థిక సాయం

● సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ పోలీసు విభాగం తరఫున, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్లలో బాధితులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం వివరాలకు సంబంధించి సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు రోడ్డు ప్రమాదాలు ముఖ్యంగా హిట్ అండ్ రన్ కేసులు బాధితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాని పేర్కొన్నారు. గుర్తు తెలియని వాహనాల వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులు వారి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోకుండా ఉండటానికి కేంద్ర ప్రభుత్వం కంపన్సేషన్ టు విక్టిమ్స్ ఆఫ్ హిట్ అండ్ రన్ మోటర్ యాక్సిడెంట్స్ స్కీం, 2022అనే పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఈ పథకం మోటార్ వెహికల్స్ యాక్ట్, 1988 సెక్షన్ 161కింద ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి అమల్లో ఉందన్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

రాయపోల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడిని రాయపోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాయపోల్ ఎస్ఐ మానస వివరాల ప్రకారం.. రాయపోల్‌లో ఈ నెల 2న మధ్యాహ్నం తాళం వేసిన ఇంట్లో నిందితుడు అక్రమంగా ప్రవేశించి రూ. 30వేల నగదు, అర తులం బంగారు కమ్మలను దొంగిలించాడు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి నిందితుడు మహేందర్‌ను అరెస్టు చేసి బెయిల్‌పై విడుదల చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడి నుంచి నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

ఐదుగురు ఆర్ఎంపీలపై కేసు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉన్న ఆస్పత్రుల్లో గత జూన్‌లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఐదుగురు ఆర్ఎంపీ డాక్టర్లు రోగులకు చికిత్స ఇస్తున్న క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా, పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్, యాంటీబయోటిక్స్ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించారు. వారిపై చర్య తీసుకోవాలని మంగళవారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్టర్ దండం లాలయ్య కుమార్ సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఐ వాసుదేవరావు ఐదుగురు ఆర్ఎంపీ డాక్టర్లపై కేసు నమోదు చేశారు.

బైండోవర్ ఉల్లంఘనలో మహిళకు జరిమానా

బెజ్జంకి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బైండోవర్ ఉల్లంఘించిన ఓ మహిళకు జరిమానా విధించినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. బెజ్జంకి మండలం చీలాపూర్‌పల్లికి చెందిన దండ్ల రేణుక గతంలో గుడుంబా కేసులో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇటీవల మళ్లీ గుడుంబా తయారీ చేస్తూ పట్టుబడి బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో మంగళవారం ఆమెను తహసీల్దార్ చంద్రశేఖర్ ముందు ఎక్సైజ్ అధికారులు హాజరుపరిచారు. దీంతో ఆమెకు రూ. 30 వేలు జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. మళ్లీ గుడుంబా తయారీకి పాల్పడితే ప్రభుత్వ పథకాలు నిలిపి వేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రమాదబీమాను చేసుకోవాలని మిరుదొడ్డి యూనియన్‌బ్యాంకు మేనేజర్ అర్జున్ తెలిపారు. మంగళవారం మండలంలోని దర్మారంలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకుఖాతాను కల్గి ఉండాలని సూచించారు. కేంద్రప్రభుత్వ సామాజిక భద్రత పథకాలు ప్రధానమంత్రి సురక్ష బీమాకు సంవత్సరానికి రూ.20 రూ.2లక్షల ప్రమాద బీమాను, ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజనకు రూ.436 చెల్లించి బీమా పొందాలని తెలిపారు.

వనమహోత్సవంలో లక్ష్యాన్ని అధిగమించాలి

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో భాగంగా గ్రామాల్లో లక్ష్యానికి మించి మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్యా పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్స్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్డీవో జయదేవ్ ఆర్య మాట్లాడారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా పెద్ద మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కమ్యూనిటీ సెంటర్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలల ఆవరణంలో మొక్కలు నాటాలని సూచించారు. ఆగస్టు 6 నుంచి మొక్కల పెంపకం కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి, ఎంపీవోలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మర్కుక్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చేబర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ఇతర నూతన చట్టాల గురించి ఎస్ఐ దామోదర్, గజ్వేల్ షీటీమ్ బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని అపరిచితుల వ్యక్తుల మాటల నమ్మి మోసపోవద్దన్నారు.

వంద శాతం ఫలితాలు వచ్చేలా పనిచేయాలి



అధ్యాపకులకు సూచనలు ఇస్తున్న ఇంటర్ బోర్డు అబ్జర్వర్ కిషన్‌నాయక్

కొండపాక, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో వందశాతం ఫలితాల టార్గెట్‌తో పనిచేయాలని ఇంటర్మీడియట్ బోర్డు అబ్జర్వర్ కిషన్ నాయక్ పేర్కొన్నాడు. మంగళవారం కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఇంటర్‌లో అడ్మిషన్లు పెంచేలా కృషి చేయాలని సూచించారు. తెలంగాణ విద్యాశాఖ జూనియర్ కాలేజీల్లో ప్రవేశపెట్టిన ఐఐటీ, ఎంసెట్ కోచింగ్ ఫిజిక్స్ క్లాసులను కచ్చితంగా విద్యార్థులకు నిర్దేశించిన తరగతుల్లో బోధించాలని సూచించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు బస్సు సౌకర్యం, హస్టల్ వసతి తదితర సమస్యల గురించి వివరించగా పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం ఫొటో పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ సూచించారు. సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఏర్పాటు చేయకపోవడం వల్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకొని, సీఎం ఫొటో పెడుతున్నారని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు బీఆర్ఎస్ నాయకులు కార్యాలయాలపై దాడి చేశారని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సిద్దిపేట అభివృద్ధి కోసం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ నిధులు తెస్తున్నారని చెప్పారు. మున్సిపల్‌లో అవినీతికి పాల్పడుతున్న కౌన్సిల్‌పై ఏసీబీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, కిషన్, బాబా, నజ్జు ఉన్నారు.

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం



ఉపాధ్యాయులకు పీఆర్టీయూ సభ్యత్వాన్ని అందజేస్తున్న ఇంద్రసేనారెడ్డి

దుబ్బాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించగలిగిన ఏకైక సంస్థ పీఆర్టీయూ మాత్రమేనని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు గురించి సెప్టెంబరు 1న పదివేల మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పల్లెశ్రీనివాస్‌గౌడ్, రాంచంద్రారెడ్డి, ఆకుల లక్ష్మన్, బానోతు శంకర్, మద్దుల లక్ష్మారెడ్డి, సింగితం నర్సింహారావు తదితరులున్నారు.

మంచినీటి సమస్యను తీర్చాలి

మిరుదొడ్డి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పదిరోజులుగా మిషన్‌భగీరథ నీరురాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో మహిళలు ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. పదిరోజులుగా భగీరథ నీళ్లురాకపోవడం వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మంచినీటి ఇబ్బందులను తీర్చాలని మహిళలు కోరారు.

విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

సిద్దిపేట రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది మాజీ ఎంపీటీసీ ఆకుల హరీశ్ పేర్కొన్నారు. మంగళవారం గుర్రాలగొంది జడ్పీ ఉన్నత పాఠశాలలో తన సొంత నిధులతో నియమించిన విద్యావలంటీర్‌కు రూ.5 వేల వేతనాన్ని హెచ్ఎం చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు సొంత డబ్బుతో ఒక విద్యావలంటీర్ ను నియమించి ప్రతి నెలా వేతనం అందిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా గిరిజన సీత్లా భవాని ఉత్సవాలు



మల్‌చెరువు తండాలో నెత్తిపై నైవేద్యాలతో వెళ్తున్న గిరిజన మహిళలు

అక్కన్నపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్ చెరువు తండాలో గిరిజనులు మంగళవారం సీత్లా భవాని ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. తమ ఆరాధ్య దైవమైన సీత్లా భవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరి చివరన మైదాన ప్రాంతంలో తమ ఆరాధ్యదైవమైన సీత్లాభవనీతో పాటు ఏడుగురు దేవతలకు నైవేద్యం తయారు చేసి ఆడపడుచులు నెత్తిన పెట్టుకొని ఇక్కడికి వచ్చి ఆరాధించారు. గిరిజనుల తొలి పండుగకు తమ ఆడపడుచులను రప్పించుకొని వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

కోహెడలో దివ్యాంగుల కార్యవర్గం ఎన్నిక

కోహెడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గం ఎన్నికను మంగళవారం నిర్వహించారు. దీనికి ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి మందకుమార్, వీహెచ్‌ఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ దండు శంకర్, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిట్యాల సంపత్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పెరిక పరశురాం, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సామ్రాట్ ప్రకాష్‌లు హాజరయ్యారు. కాగా వీహెచ్‌పీఎస్ మండల నూతన కమిటీకీ అధ్యక్షుడిగా దుంబాల వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా బానోతు రవి, ఇట్టబోయిన చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా కటికోజ్వాల వెంకటచారి, కార్యదర్శిగా సూరి మణిందర్, సహాయ కార్యదర్శిగా చిట్యాల సంపత్, కోశాధికారి కందిరాజు రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఏసీరెడ్డి ధర్మయ్య, సిరిగారి సంజీవరెడ్డి, జక్కుల సౌభాగ్య, అప్పిస కనకయ్య, గౌరవ సలహాదారులుగా సంధి రాజిరెడ్డి ఎన్నికయ్యారు.

దౌల్తాబాద్‌లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

దౌల్తాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలో వెంటనే ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.భాస్కర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గత రెండు రోజుల క్రితం పబ్బ అశోక్ గుప్తా ఇల్లు షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా దగ్ధం కావడం బాధాకరమని వారి కుటుంబానికి నష్టపరిహారం రూ.20 లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ లేనందున 30 కిలోమీటర్ల దూరంలో గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక నుంచి ఫైర్ సిబ్బంది చేరుకునేసరికి ఎక్కువ నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే వెంటనే జోక్యం చేసుకొని దౌల్తాబాద్ మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.